క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామం వద్ద జాతీయ రహదారిపై వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికులు వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కొత్తవ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారసపడితే సమాచారం ఇవ్వాలని వాహనదారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలి



మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించే దిశగ సీఎం రేవంత్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చర్యలు తీసుకోవాలని జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తాడిచర్లలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీయూఎఫ్ ఫోరం నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. 250 గజాల స్థలంతో పాటు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, హెల్త్, ఉచిత బస్సు పాసులతో పాటు జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారయణ, జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య, ఉపాధ్యక్షుడు బోయిన రాజయ్య, మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బియ్యం దందా!

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. గ్రామాల్లోని ప్రజల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని విక్రయించి పలు చోట్ల నిల్వ చేసి టన్నుల కొద్ది మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు ఎక్కువ ధర అమ్ముకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని ఆకినపల్లి, పిడిసిల్ల, ఇస్సిపేట, పర్లపల్లి, తదితర గ్రామాల్లో నిల్వలను ఏర్పాటు చేసుకొని రాత్రి సమయాల్లో వేరే గ్రామాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఎక్కడో ఒక చోట బియ్యం రవాణా పట్టుబడగా పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టడంతో అక్రమ బియ్యం దందాకు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. సోదాలను నిర్వహించి పలువురిపై కేసులు పెట్టినా పూర్తిస్థాయిలో అక్రమ దందాపై దృష్టి సారించడం లేదని అధికారులకు, అక్రమార్కులకు మధ్య ఒప్పందం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కమీషన్లతో రవాణా..

బియ్యం దందా చేస్తున్న అక్రమార్కులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు కమీషన్‌ను చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యవహారం నడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో అధికారులకు ముందస్తు సమాచారం ఇస్తూనే ముడుపులు అందించి పక్క రాష్ట్రాలకు బియ్యాన్ని తరలిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

14న సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ నెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు అభివృద్ధి పనులు, నిధులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

సంతకు స్థలమేది?

- రోడ్లపైనే వ్యాపారాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు



రోడ్లపైనే కొనసాగుతున్న సంత

ఏటూరునాగారం: మండల కేంద్రంలో వారంతపు సంతకు సరైన స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం వచ్చిందంటే మండల కేంద్రంలోని బొడ్రాయివద్ద రోడ్లపై సంతను ఏర్పాటు చేసి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సుమారు 43 గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఈ సంతలో వారికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. రోడ్లపై వ్యాపారం కావడంతో వస్తువులు కొనుగోలు చేసే వినియోగదారులు, వ్యాపారులతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు, నీడను కల్పించడం, విద్యుత్ ఇలా ఎలాంటి సౌకర్యం లేదు. మేజర్ గ్రామ పంచాయతీ అయినప్పటికీ సరైన సంతకు స్థలం లేక నానా అవస్థలు పడుతున్నారు. గతంలో రామాలయం వద్ద సంతను ఏర్పాటు చేసి వ్యాపారాన్ని కొసాగించేవారు. బొడ్రాయి ఏర్పాటు అయిన నాటి నుంచి అక్కడ సంత ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ పక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు, వస్తువులను వాహనాల్లో తీసుకువచ్చే వారు రోడ్లపై ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. సంత కోసం వ్యాపారులు, వినియోగదారుల కోసం గ్రామ పంచాయతీ అధికారులు శాశ్వతంగా సంతకు స్థలాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. రామాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సంత నిర్వాహణకు ఏర్పాటు చేస్తే బాగుటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లేదా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ స్థలాన్ని పరిశీలించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కనే అమ్ముతున్న కూరగాయలు



స్థలాన్ని కేటాయించాలి



ప్రజల అవసరాలకు అనుగుణంగా సంత కోసం స్థలాన్ని కేటాయించాలి. రోడ్లపై వ్యాపారం వల్ల ప్రజలు, వినియోగదారులకు ఇబ్బందిగా ఉంటుంది. గ్రామస్తులు, గ్రామ పంచాయతీ అధికారులు సమాలోచన చేసి స్థలాన్ని ఎంపిక చేయాలి.

– పోగుల లక్ష్మీనారాయణ, ఏటూరునాగారం

అభివృద్ధి చేయాలి



వారంతపు సంతకు స్థలం ఏర్పాటు చేసి బట్టలతోపాటు అన్ని రకాలుగా విక్రయించేలా అభివృద్ధి చేయాలి గ్రామంలో మంచి స్థలాన్ని చూసి అన్ని వ్యాపారం అక్కడే నిర్వహించేలా చూడాలి. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి.

– పెండ్యాల ప్రభాకర్, ఏటూరునాగారం

ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న దయానందం

ములుగు రూరల్: నాయకపోడులు విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనకబడి ఉన్నామని ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని ఆదివాసీ నాయకపోడు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన దయానందం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గట్టమ్మాలయం వద్ద ఆదివాసీ నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల మంది ఆదివాసీ నాయకపోడ్‌లు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం నాయకపోడు కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏటూరునాగారం గిరిజన సమీకృత వెబ్‌సైట్‌లో ఆదివాసీ నాయకపోడ్ కులస్తుల ఆచార, సంస్కృతి, సంప్రదాయాలు, విధి, విధానాలు ఉండేవని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నాయకపోడ్ కులస్తుల నామకణం తీసివేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో తమకు పేజీని ఏర్పాటు చేయాలని అన్నారు. నాయకులు రాజన్న, మల్లేష్, రామకృష్ణ, భూమయ్య, సతీష్, కృష్ణ, అంజయ్య, నరేష్, సమ్మయ్య, కొత్త సదయ్య, లక్ష్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగులను గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నర్మద

వాజేడు: వైద్య సిబ్బంది మానసిక రోగులను గుర్తించాలని మానసిక వైద్యురాలు డాక్టర్ నర్మద అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. వాజేడు, పేరూరు, వెంకటాపురం(కె) మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లోని మానసిక రోగులను వాజేడు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రతీ నెలలో రెండో సోమవారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వాజేడు వైద్యులు మధుకర్, మహేందర్, హెల్త్ సూపర్‌వైజర్ కోటి నాగిరెడ్డి ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి పలువురికి గాయాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ములుగు రూరల్: కారును ఓవర్‌టెక్ చేయబోయి అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన వెంకటాపురం(ఎం)–ఇంచర్ల గ్రామ శివారు మధ్యలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటాపురం(ఎం) మండల కేంద్రానికి చెందిన మేకల అజయ్, మేకల విష్ణు, నాలగిరి రాకేష్, రేవంత్ ట్రాక్టర్ సిమెంట్ ఇటుకను తీసుకోని దేవగిరిగిపట్నం బయలుదేరారు. ఇంచర్ల శివారుకు రాగానే ముందుగా ఉన్న కారును ఓవర్‌టెక్ చేయబోయి ట్రా క్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మేకల రాకేష్, నాలగిరి రాకేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వెంకటా పురం(ఎం) రెండవ ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగ్రాతులను ములుగు ఏరి యా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అజయ్, రేవంత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

'ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటా..'

చిట్యాల: నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పని తీరును ప్రజలు అవగాహన చేసుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ అసహనంతో ఉన్నారు కావున భవిష్యత్ మనదేనన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్న వారితో మనకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రస్తుతం జెండా మోస్తున్న కార్యకర్తలే నిజమైన బీఆర్ఎస్ కుటుంబ సభ్యులన్నారు. గతంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.వేల కోట్లను వెచ్చించి అభివృద్ధి చేశానని అన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

పలిమెల: భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్టు (సీపీఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14, 15న రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పోలం రాజేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సూదుల శంకర్, పడాల రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

బిందుసాయిలతకు ప్రతిభా పురస్కారం అవార్డు



రవీందర్ నుంచి అవార్డును తీసుకుంటున్న బిందుసాయిలత

ఏటూరునాగారం: మండల పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివి 10జీపీఏ సాధించిన బిందుసాయిలత ప్రతిభా పురస్కారం అవార్డు అందుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టెన్త్‌లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై పలువురికి అవార్డులను అందజేశారు. అనంతరం ఫౌండర్ రవీందర్ బిందుసాయిలతకు వందేమాతరం ప్రతిభా పురస్కార్ అవార్డును అందజేశారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ టెన్త్‌లో రాణించిన ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయి వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సర్వోత్తమరెడ్డి, ఏటూరు నాగారం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కళాజాత ఆటపాటలతో సాంస్కృతిక కళాకారులు సోమవారం మండల పరిధిలోని పస్రా, ముత్తాపురం గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారధి రొంటాల కుమార్ బృందంచే రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రజలకు అర్ధమయ్యేలా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని, సమీపంలో ఉన్న అధికారులను తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రేలా కుమార్, రాగుల శంకర్, బుచ్చన్న, ఈర్ల సాగర్, మార్త రవి, కనకం రాజేందర్, ఎండి రహీమొద్దీన్, బోడ కిషన్, రామంచ సురేష్, ఉప్పుల విజయ్ కుమార్, పోలెపాక తిరుపతి, నరేష్, ఉండ్రాతి భాస్కర్, కామెర దీపక్, మొగిలిచర్ల రాము, శ్రీలత, శోభతో పాటు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గుండబోయిన చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలని అన్నారు. ప్రతి మహిళకు రూ.2500 చెల్లించాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో మెరుగైన పద్ధతులు పాటించాలని అన్నారు. పోడు వ్యవసాయదారులకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోయిని సాంబయ్య, ఆదిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమికి హక్కు కల్పించాలి



దీక్షను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

వెంకటాపురం(కె): కొమరంభీం కాలనీ ఆదివాసీల సాగులో ఉన్న భూమికి హక్కు కల్పించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లు పొంది గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతంలో రిజర్వేషన్లు పొందుతున్నారని అన్నారు. నాయకులు పూనెం సాయి, ప్రతాప్, వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం



ట్రాక్కర్‌తో దుక్కి చేస్తున్న రైతు

మంగపేట: వానాకాలం సీజన్ తొలకరి ప్రారంభం కావడం మృగశిర కార్తె ముందు రోజే వర్షం పడటంతో రైతులు వరి పంట సాగుకు సన్నద్ధం అవుతున్నారు. రెండు రోజుల నుంచి మండల వ్యాప్తంగా రైతులు ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల ఆయకట్టు పరిధిలోని మాగాణి భూముల్లో ట్రాక్టర్లతో దుక్కి చేస్తు బిజీగా కనిపిస్తున్నారు. అదే విధంగా మండలంలోని మల్లూరువాగు మధ్యతరహా ప్రాజెక్టు ఆయకట్టు, గౌరారం వాగుపై కోమటిపల్లి వద్ద నిర్మించిన ఆనకట్ట ఆయకట్టు పరిధిలోని భూముల రైతులు సాగుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధానంగా బోరుబావులపై ఆధారపడి సాగుచేసే రైతులు ఇప్పటికే వేసవి దుక్కులు చేసి ఉంచి నారు పోసేందుకు నారుమడులను దుక్కి చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

వాజేడు: రైతులకు విక్రయించడానికి అందుబాటులో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు సొసైటీ సెక్రెటరీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీలో ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఎంటీయూ 1224, బీపీటీ 5204 రకం విత్తనాలు ఉన్నట్లు వెల్లడించారు. అదే విధంగా రైతులకు అవసరమైన టార్పాలిన్లు(బరకాలు), బ్యాటరీ పంపులు, పవర్ స్ప్రేయర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు సొసైటీకి వచ్చి కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మొట్లపల్లిలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు



పీవీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి అన్నారు. సోమవారం మొట్లపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. మొట్లపల్లి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు వివిధ కాంపిటీటివ్ పరీక్షల్లో విజయాలు సాధిస్తున్నారని, ఎన్‌సీసీలోను, ఆటల్లోను రాష్ట్ర జాతీయ స్థాయిలో ప్రతిభను చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

మల్హర్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని వల్లెకుంట ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం అన్నారు. మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పీవీనగర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం వల్లెకుంట జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ.. విద్యతోనే సామాజిక మార్పు వస్తుందని, ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. జెడ్పీటీసీ కొమల రాజిరెడి, మాజీ జెడ్పీటీసీ రాజమ్మ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సత్యనారాయణ, షేక్ మెహరాజ్ పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల అందజేత



సరుకులు అందిస్తున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మేకమల్ల లక్ష్మీ కుమారుడు రమేశ్ గత సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా తండ్రి మృతితో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు, వృద్ధ తల్లి పరిస్థితిని చూసి ఎస్సై శ్రావణ్‌కుమార్ సోమవారం బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యంతో పాటు, నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లింగన్న, అస్లాంజానీలు ఉన్నారు.